# సారీ! సారీ!!

## క్రిష్



"ఛ!" పదోసారి విసుగ్గా వాచీ చూసుకుని ఆర్టీసిని కసిగా తిట్టుకోబోతుండగా.. అప్పుడొచ్చింది 'అశ్విని' బస్సు.. నిండుచూలాలిలా.. నిమ్మళంగా! ఒక్క బస్సులోనే రెండు బస్సుల జనం... పుట్‌బోర్డు మీది నుంచి వేలాడుతున్నారు!

అయినా తప్పదు.. అదే ఆఖరి బస్సు! అది మిస్సయితే రాత్రంతా బస్టాండులో దోమలతో చెక్క భజనే! అనుకుంటూ అపర అభిమన్యుడిలా విజృంభించి జనాల్ని తోసుకుంటూ లోనికెళ్ళి అతికష్టంమీద నిల్ర్దొక్కుకున్న కాస్సేపటికి బస్సు కదిలింది.

టికెట్ తీసుకున్నాక చుట్టూ వున్న వాళ్ళని పరికింపసాగాను. ప్రయాణం రెండు గంటలు మరి! అందుకే, కాలక్షేపానికి ప్రయాణకాలంలో అలా జనాల్ని పరిశీలించడం అలవాటైంది.

అలా పరిశీలిస్తుండగా బస్సుకు సడన్ బ్రేక్ పడడం, సారీ అన్న మాట వినబడడం ఒకేసారి జరిగాయి.

ఆ అన్నదెవరా అని వెనక్కు తిరిగి చూస్తే ఓ పాతికేళ్ళ యువకుడు.. సంజయ్‌దత్‌లా జుట్టు పెంచుకొని వున్నాడు. పక్కా రోమియోలా వున్నాడు నిలబడి! అతనికి కాస్తంత దూరంలో బెదురుచూపుల్తో ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి!

'సీన్' అర్థమైపోయింది!

హూ! ఈ మహిళా సంఘాల వాళ్ళు ఎంత అరచి గీపెట్టినా, ఎన్ని ఉద్యమాలు లేవదీసినా ఈ రోమియోలకు బుద్ధిరాదూ.. అమ్మాయిలకు ధైర్యమూ రాదు. అయినా కనీసం తీక్షణ చూపుల్తోనైనా ప్రతిఘటించకుండా, అలా పులిని చూసిన లేడిపిల్లలా బెదిరిపోతూ దూరం జరుగుతున్న ఆ అమ్మాయిని చూసి నాక్కాస్త కోపం కూడా వచ్చింది.

డ్రైవర్ కూడా ధారాళంగా బ్రేకులు వేస్తూ ఆ రోమియోకు పరోక్షంగా సహకరిస్తూనే వున్నాడు.

ఆ అమ్మాయి ఎంత దూరం జరిగినా ఆ రోమియో మాత్రం 'సారీ' చెబుతూనే వున్నాడు!?!

కాస్సేపయాక ఎవరో ముసలాయన సీటు ఖాళీ చేసి దిగిపోతూ 'ఈ వయసులోనే సరిగా నిలబడలేక పోతున్నావే పాపం? ఈ సీట్లో కూర్చో!' అని గట్టిగా అందరూ వినేలా అనడంతో ఆయనకేసి కొరకొరా చూస్తూ గత్యంతరం లేక ఆ సీట్లో కూలబడ్డాడు 'రోమియో'

ఆ అమ్మాయికి మాత్రం సీటు దొరకనే లేదు పాపం!

ఒక చేత్తో రాడ్‌ని మరో చేత్తో సూట్‌కేస్‌ని పట్టుకొని అలాగే నిలబడి వుంది.

'ఆ సూట్‌కేస్ అక్కడ పెట్టొచ్చు గదమ్మా".

ఎవరో జాలిపడి అప్పుడే ఖాళీ అయిన -సూట్ కేస్ పెట్టుకునే స్థలం చూపించారు.

బస్సు మొత్తానికి, పెట్టెలు పెట్టుకోటానికి అక్కడొక్కచోటే వుంది స్థలం.

ఆ అమ్మాయి ఖర్మ కొద్దీ అది కూడా ఆ రోమియో కూర్చున్న సీటుకు పైనే వుండడంతో సూట్‌కేస్ పెట్టేటప్పుడు ఆ అమ్మాయి పైట చాటు పరువాల్ని చూసే అవకాశాన్ని ఆ రోమియోగాడు బాగానే సద్వినియోగం చేసుకున్నాడు.

అయినా అదేమి పట్టనట్టుగా ఆ అమ్మాయి సూట్‌కేస్ పెట్టేసి మళ్ళీ రాడ్‌ని పట్టుకుని నిలబడింది.

నా పిడికిళ్ళు బిగుసుకున్నాయి. వాణ్ణి వతలకు లాగి ఒక్క గుద్దు గుద్దాలనుకున్నాను కానీ ఏదో తెలీని నిస్సహాయస్థితి నన్ను కంట్రోల్ చేసింది. 'ప్చ్! పాపం ఆడవాళ్ళు!" అని అనుకుంటుండగా 'పాలెం' అన్న కండక్టర్ అరుపుకు ఉలిక్కిపడ్డాను.

ఆ అమ్మాయి దిగాల్సిన ఊరు కూడా అదేనేమో సూట్‌కేస్ తీసుకోవడానికి చేతులు చాపింది.

'ఇడియట్! మళ్ళీ చూపుల్తో తినేస్తున్నాడు పాపం ఆ పిల్లని!"

పళ్ళు పటపటా కొరుకుతూ వాడివేపు అసహ్యంగా ఓసారి చూసి, బస్సు దిగబోతుండగా 'హబ్బా' అన్న గావుకేక వినిపించింది.

'ఏం జరిగిందా?' అని వెనక్కు తిరిగి చూస్తే ఆ రోమియో గాడు బుర్ర మీద రెండు చేతులూ పెట్టుకొని విలవిల్లాడుతూ కనిపించాడు.

'సారీ! బాగా గట్టిగా తగిలినట్లుందే సూట్‌కేసు? అయ్యో! వెరీ సారీ!' అంటూ గిరుక్కున తిరిగి బస్సు దిగుతున్న ఆ అమ్మాయి పెదిమలు బిగబట్టి నవ్వునాపుకోవడం చూసి తెల్లబోయాను!

'సీన్' అర్థమై, 'థమ్సప్' సింబల్‌గా పిడికిలి చూపిస్తూ వెల్‌డన్ అన్నాను ఆ అమ్మాయితోబాటూ అడుగులేస్తూ.

'థాంక్స్.. అద్సరేగానీ అంకుల్.. మీరెందుకు బుర్ర తడుముకుంటున్నారు!' నవ్వాపుకోలేక అడిగింది.

అప్పుడు గమనించాను నా చెయ్యి అప్రయత్నంగా నా బుర్రని తడమడం.

'ఆ.. హబ్బే.. ఏం లేదూ.. అవును కదా? ఎందుకూ?" మామూలవడానికి కష్టపడ్డాను.

ముసిముసిగా నవ్వుకుంటూ వడివడిగా వెళ్తున్న ఆ అమ్మాయి అడుగడుగులోనూ ఓ ఝాన్సీరాణీ, ఓ రుద్రమదేవి, ఓ కిరణ్‌బేడి కనిపించారు.

'ఇంతకు నేనెందుకు బుర్ర తడుముకున్నానబ్బా!?' ఆ ప్రశ్న ఇంటికెళ్ళి స్నానం చేసేదాకా వేధిస్తూనే వుంది.

ఒక్కోసారి అనాలోచితంగా అప్రయత్నంగా మనం చేసే పనులకు కూడా ఏవో అర్థాలు వుంటాయి.

'ఫ్రెష్'గా స్నానం చేశాక సమాధానం దొరికింది.

'నిజమే! ఇకనుంచైనా అలాంటి సందర్భాల్లో చేతులు కట్టుక్కూర్చోకూడదు' అని దృఢంగా నిర్ణయించుకున్నాను.